# మన ఆచారములు - అంతరార్థములు

- నిత్యానంద్.

కర్మ భూమిగా, వేద భూమిగా పిలువబడే మన దేశములో అనాదిగా ఎన్నో ఆచారములు అమలులో ఉన్నాయి. నేటి తరము వారు వాటిని మూఢనమ్మకాలు అని కొట్టిపడేస్తున్నా, నిశితముగా పరిశీలిస్తే వాటి వెనుక ఎంతో ప్రయోజనము, శోధించి సాధించిన అనుభవసారము కనిపిస్తుంది. పసుపు వాడిక ఏనాటినుండి మనదేశములో ఉన్నదో తెలియనిది కాదు. ముఖ్యముగా పండుగలలోను, పెళ్ళి సందర్భములోను, ఇతరమైన ముఖ్య కార్యక్రమములలో పసుపు వాడిక పరిసరములను శుద్ధి చేయడానికి (క్రిమి సంహారిణిగా) ఉపకరిస్తుంది. నేడు ఆ విషయాన్నే పశ్చిమదేశములు ధృవీకరిస్తున్నాయి. కాని వారు దానిని కనుగొన్నట్లు ప్రపంచాన్ని మభ్యపెడుతున్నారు. అసలు విషయానికి వస్తే, మన పూర్వికులు నిర్దేశించిన సూత్రములను విమర్శించే ముందు ఒక్కసారి ఆలోచించడం మన బాధ్యత!

భోజనము చేసేముందు పరిషేచనము (నీటిని భోజనపాత్రాదుల చుట్టు చల్లు క్రియ) చేయడం ఒకప్పుడు ఆనవాయితీ. అలా ఎందుకు చేసేవారు అని ఒక్కసారి ఆలోచిస్తే, ఆధ్యాత్మిక పరంగా కారణాలేమైనా, పూర్వం రోజులలో నేడున్నట్లు సిమెంటు అరుగులు, గచ్చులు లేవు. పేడతో అలికిన ప్రదేశములోనే వంట, వార్పు, ఆపై భోజనము. ఇక పళ్ళెములో తినేవారున్నా, ఎక్కువగా విస్తరిలో తినేవారు ఉండేవారు. విస్తరి వేసి వడ్డన చేస్తే, చీమలు మొదలైన కీటకములు రావడము సహజం. కనుక వాటిని విస్తరిలోకి రాకుండా నిలువరించేందుకు పళ్ళెము లేదా విస్తరి చుట్టూ నీటిని చల్లేవారు. ఇలా చేయడం వలన ఆ క్రిములకు ఆహారము అందకుండా చేయడం భూతదయలేకపోవడం క్రిందే జమకట్టవచ్చు. అందుకే ఆహారము తినేముందు కొంత అన్నాన్ని ప్రక్కన ఉంచడం చేసేవారు. అన్నం తినడం పూర్తి అయ్యేసరికి విస్తరి చుట్టూ చల్లిన నీరు ఇగిరి పోవడం జరుగుతుంది. క్రిములు విస్తరిలోకి ప్రవేశిస్తే విస్తరులు పారవేయబడినపుడు జీవ హింస జరిగే అవకాశం ఉంది. అందుకే భోజనానంతరము తిరిగి నీటిని చల్లేవారు. అలాగే పంక్తి భోజనములు చేయు సమయములో అందరూ ముగించిన పిదప మాత్రమే వారి వారి స్థానములనుండి లేచేవారు. ఎవరైనా ముందుగా లేవడము వలన వారి విస్తరి ఎగిరి అందులోని ఎంగిలి పదార్థము వేరొకరి విస్తరిలో పడే అవకాశము ఉంది. అంతేకాక అమర్యాదగా ప్రవర్తించినట్లు అవుతుంది. ఇలా నిశితముగా పరిశీలిస్తే ఎన్నో విషయములు తెలుస్తాయి.

ఈ శీర్షికపై మీ అభిప్రాయములు తెలియజేయండి. ఇది మన గురించి మనము తెలుసుకోవడమే ధ్యేయంగా నిర్వహిస్తున్న అంశం. వచ్చే సంచికలో మరొక విషయము గురించి చర్చిద్దాం!

*** *** ***